
**జీవితం తిప్పే మలుపులు అనివార్యమైనవే. కానీ ఎప్పుడో ఎక్కడో మనలోని సున్నితాలు, తాజాదనాలూ జారిపోవటం చూసుకోలేం. అయినా ఏదో ఒక సందర్భం గుర్తు చెయ్యకపోదన్నదే ఈ కథ.**

వాడ్రేవు వీరలక్ష్మీదేవి

# 2

# నిన్నటి మల్లెదండ

చారి పి.ఎస్.





అతను గోడ బీరువాకి ఉన్న చెక్క తలుపుతీసి లోపల ఉంచిన నీలం రంగు అట్ట ఉన్న ఫైల్ బయటికి తీస్తున్నప్పుడు ఆమె వంటగదిలో టీ కోసం నీళ్లు మరిగిస్తోంది.

ఇద్దరిదీ చెరొకరకం టీ. ఆమె పాలకోసం ఫ్రిజ్ తెరిచేలోపు అతను గబుక్కున వచ్చి ఫ్రిజ్ తలుపు మూసేశాడు. అప్పటికే లోపల పెట్టిన మల్లెపూల వాసన బయటికి ఉరకబోయి ఉనికిని చెప్పేసింది. కానీ ఆమె గమనించలేదు. గమనించేలా లేదు కూడా.

"పాలు ఇవతలే ఉన్నాయి చూడు," అంటూ వంట గట్టు మీది మరో గిన్నె మూత తీసి చూపించాడు.

ఆమెకు పాలతోనూ, అతనికి బ్లాక్‌గానూ టీ. గాజు కప్పులు అతనికి ఇష్టం. రెండు రంగుల్లోనూ పైకి కనిపిస్తూ రెండు టీలూ.

ఆమె చేతిలో కప్పు లాక్కుని ఒక సిప్ చేసి కుడిచేత్తో చెంపలాంటి ఆమె బుగ్గ గిల్లి, నవ్వి మళ్లీ ఇచ్చేశాడు. ఆమె కోపంగా చూసి టీ కప్పు గట్టు మీద పెట్టేసింది.

"పోనీ ఇది తాగు," అని తన బ్లాక్ టీ తనే ఆమె పెదాలకు తాకించి ఆమె పెట్టిన చేదుమొహం చూసి పకపకా నవ్వేసి, "అక్కడ కూచుందాం రా... నీకో విశేషం చూపిస్తాను ఇవాళ," అంటూ బెడ్ రూమ్ వేపు నడిచాడు.

ఆమెకు టీ చాలా వేడిగా ఇష్టం. ఎంత వేడిగా అంటే చివరి చుక్క కూడా అంతే వేడిగా తాగాలి. అలా ఉండేలా కప్పు నింపుకుంటుంది.

ఈ గొడవలో టీ కాస్త చల్లారింది. ఆమె మనసు కుదురుగా లేదు. టీ వెచ్చపెట్టుకోవాలనిపించలేదు. ఓ నిమిషం సింక్‌లో పారబోసేద్దామా అనుకుంది. కానీ మనస్కరించలేదు. అలాగే కప్పు పట్టుకుని బెడ్ రూమ్‌లోకి వెళ్లింది.

ఒకే ఒక మంచం. అదీ సింగిల్ కాట్. మూడు దిళ్లు వెనకగానూ, రెండు పక్కన వేసి పెట్టాడు, జారబడి కూచునేందుకు రెడీగా. తాను పక్కనే ఉన్న ఊగే కుర్చీలో కూచున్నాడు ఆమె కోసం చూస్తూ.

“నువ్వు మంచం మీద కూర్చో, నేను ఇక్కడ కూచుంటాను,” అంది కుర్చీ చూపించి.

“అరే, అమ్మాయ్ నీకోసం ఇవన్నీ సర్ది అమర్చిపెట్టేను. కూచోండి మేడమ్. మీ పవిత్రతకేమీ లోటు రాదు. రానివ్వం కదా,” అన్నాడు కంటి చివర నవ్వు దాచి.

మామూలుగా అయితే ఆ చివరి మాటకి ఉక్రోషం తెచ్చుకుని మంచం మీదే కూర్చుని ఉండును ఆమె. కానీ ఇప్పుడు ఉక్రోషాన్ని మించినదేదో ఉంది మనసులో.

“వద్దులే ఇలా కూచుంటాను,” అంది. కిటికీ పక్కగా ఉన్న నీల్ కమల్ కుర్చీలో అమరినట్టు కూచుంది.

“లక్ష్మీదేవిలా ఉన్నావ్.”

“అదేంటి కొత్తగా.”

“అంటే ఆవిడ తెల్లకమలంలోనో ఎర్ర కమలంలోనో కూర్చుంటుంది. నువ్వు నీలికమలంలో...” పెదవి వంపు దగ్గర నవ్వు దాచాడు.

ఆమెకూ నవ్వు రాబోయింది. సగం నవ్వింది.

“లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ వారు ఇంకాస్త విశదంగా నవ్వితే మరింత మోహనంగా ఉంటారు. మరింత మోహంలో పడేస్తారు. ప్రాణాలు పోతున్నాయండీ ఇక్కడ... ఏం జీవితబీమానో ఏమో.”

ఈసారి పకపకా నవ్వింది ఆపుకోలేక. ఆమె ఎల్.ఐ.సి.లో పనిచేస్తుంది.

“పూచింది పూచింది పున్నాగ...” చేత్తో అభినయిస్తూ పాడేడు.

“పూర్తిగా పాడొచ్చుగా...”

“ఇది చిత్రలహరి సమయం కాదు. ఇంకా రాత్రి 8.30 కాలేదు. ముందు నా ప్రశ్నకు లేదా నేను అడిగినదానికి సమాధానం కావాలి. చెప్పండి మేడమ్. ఆరోజు సాయంత్రం రైల్వేస్టేషన్‌లో నేను మీ కజిన్‌తో వచ్చినప్పుడు... అదే, మిమ్మల్ని రైలు నుండి దింపుకోడానికి వచ్చినప్పుడు...”

“దింపుకోవడమేమిటి. భాష మార్చు...”

“పోనీ దిగేటప్పుడు ఆ వాలుకనుల వయ్యారాన్ని ఆహ్వానించడానికి వచ్చినప్పుడు,” అని ఆగేడు.

ఆగి, ఊగే కుర్చీని ఆపి, లేచి కప్పులు రెండూ తీసికెళ్లి వంటగదిలో సింక్‌లో పెట్టి, “వాలు చూపుల గాలమేసి నన్ను దోచే వేళనే,” అని పాడుకుంటూ వచ్చాడు.

“భలే పాట కదా ఇది. అప్పట్లో సుందరంగారు పాడేవారు. మొదట మనిద్దరం ఆయన దగ్గరేకదా విన్నాం,” అంది, అన్నీ మరచి లేదా మరిపించే తెలివితో కావచ్చు.

సుందరం హార్మోనిస్ట్.

"ఇది గుర్తుంది. కానీ దానికి అటూ ఇటూ జరిగినవి మాత్రం గుర్తు లేవం టావు... నేను నమ్మాలి."

'నేను' అంటూ బొటనవేలు తన గుండె మీద గుచ్చుకుని ఆమెదాకా వచ్చి ఆమెవేపు తిప్పేడు. "చూసేవా నేను అంటే నువ్వన్నమాట. నా వేలే నా మాట విన కుండా నీవేపు తిరిగిపోయింది."

ఈ చమత్కారాలు నిలువుగా అడ్డంగా పేనుకుని, అల్లుకుని వలలాగ ఆమెను కమ్మేస్తున్నాయి. లోలోపల... లేదు లేదు, కాదు, వద్దు అనుకుంటూ, తనకి తాను మళ్లీ మళ్లీ చెప్పుకుంటున్నా, ఆ మాటలు తన చెవులకే బలహీనంగా వినిపిస్తున్నాయి. ఈ రంగురంగుల వల మృదువుగా మెత్తగా చెవులమీదకి జారిపోతోంది- పూల వల.

"అప్పుడు రైలు నుంచి నువు దిగుతూ దిగుతూ ఓ సెకను మీ అన్నను చూసి నవ్వి... ఒక సెకనే అని నాకు గుర్తు. వెంటనే పక్కనున్న నన్ను చూస్తూ ఉండిపోయావు. నాకెలా తెలిసిందంటే నేనూ నిన్ను చూస్తూ ఉండిపోయాను. అప్పుడు నీ కళ్లు మెరిసాయి. తళుక్కుమన్నాయి. మిలమిలలాడాయి. ఇంకా ఎన్ని అనొచ్చో అన్నీ అన్నాయి..."

"ఆగాగు. ఆ రోజు నేను రైలు దిగి మా అన్నని చూసి నవ్వి పలకరించి అప్పుడు నిన్ను చూశాను, పక్కన ఎవరో ఉన్నట్టున్నారే అని. దానికి కనీసం మూడు నించి అయిదు నిముషాలు టైం పట్టి ఉంటుంది. అది నీకు సెకనులా అనిపించిందా. అలా ఎలా అనిపిస్తుందబ్బా. అప్పుడే పడిపోయేనన్నావు కదా... గంటలా అనిపించాలే."

"అక్కడే ఉంది అసలు విషయం. ముందు నేను నిన్ను చూసినప్పుడు, నువు నన్ను చూడనప్పుడు, మళ్లీ నేను చూసినప్పుడు- మళ్లీ నువు ఎటో చూసినప్పుడు, అప్పుడు నేను నిన్ను చూస్తున్న..."

"చాల్లే తమాషా. అప్పుడు నేను ఎవరా ఇతను? అన్నయ్యతో ఎప్పుడూ చూడలేదనుకున్నాను. అంతే. మెరుపులు నీ అపోహ."

కుర్చీ ఎదురుగా నిలబడి ఒప్పించాలన్న ప్రయత్నం వీగిపోవడంతో హతాశు డైనట్టు వెనక్కి వెనక్కి అలాగే రెండడుగులు వేసి మంచం మీద కూలబడి దిళ్లని ఆనుకుని జారబడ్డాడు.

"అంతేనంటావా? మరెందుకు ఇక్కడ అప్పటినుంచీ ఇలా గొయ్యి పడి పూడకుండా ఉండిపోయింది," అని రెండు చేతులతో తన గుండెని పట్టుకుంటూ ఏడుపు మొహం పెట్టాడు.

ఆమె చెవుల మీది మాయజలతారు వల నెమ్మదిగా భుజాలదాకా జారింది. నవ్వుతూ లేచి వచ్చి చేతులు రెండూ పట్టుకుని గుండె మీంచి తీసి, ''ఏదీ గొయ్యి చూడనీ,'' అంటూ లాగేసి పక్కన కూచుంది.

''టైం ఏడుంపావు అయింది. నేను వచ్చి గంట దాటింది. మరో గంటలో వెళ్లాలి. త్వరగా చెప్పు. ఏదో చెప్తానని కదా రమ్మన్నావు.''

''నువు ఎన్నిసార్లు అడిగినా ఇంకా ఆలోచించాలంటున్నావ్. ఏం ఆలోచించాలి. ముప్ఫయి ఏళ్ల కిందట అప్పుడు మనం ఒకరికొకరం ఇష్టం అయిపోయాం. మనకే తెలీకుండా చెప్పుకోలేకపోయాం. అది నువు ఒప్పుకోవడం లేదు.''

''నిజమే కదా... నాకు అలా ఏమీలేదు... అనిపించలేదు అప్పుడు.''

''పాపం పసికూన... వెళ్తున్నానని చెప్పడానికి వచ్చి నువు నా చేతిలో పెట్టిన నోట్ బుక్ ఇంకా దాచాను చూస్తావా,'' అని లేవబోయాడు.

''వద్దులే'' అని వారించి, ''అయితే నోట్‌బుక్ ఇస్తే ఏంటిట,'' అని దబాయించింది బలహీనంగా.

''ఉత్త నోట్ బుక్కా. అందులో ఆ పదిరోజులూ నేను పాడిన పాటలు, సమయాలు, తేదీల వివరాలూ... ఎందుకటా అవన్నీ రాసుకున్నారు పాపాయిగారు? అప్పుడు చిన్నపాప కదా మరి!''

''అప్పుడు, అప్పుడూ...'' తప్పించుకుని, చూపు తిప్పుకుని, చెయ్యి వదిలేసి లేచింది.

కిటికీ దగ్గరకు వచ్చింది. పసుపు లేతాకుపచ్చ రంగుగళ్ల చేనేత కిటికీ తెర అడిగింది-

ఇక్కడికి రాగానే ఎందుకు కూడా వెళ్లి ఈ కిటికీలకు, గుమ్మాలకు అతనికి తెరలు కొనిపెట్టావు. పూల దుప్పట్లు ఎంచిపెట్టావు, కొనిపించావు. ఏమిటీ ఆసక్తి అని అడగలేదు కానీ అడిగినట్టనిపించింది.

తెర కాస్త పక్కకి తీసి కిటికీలోంచి కిందకి చూసింది. కింద బాగా విస్తరించి విప్పుకున్నట్టున్న నిద్రగన్నేరు చెట్టు. దాని ఆకుపచ్చని పైకప్పు. చెట్లని పైనుంచి చూస్తే భలే ఉంటాయి. ఆకుపచ్చని విరబోతతో.

ఈ అయిదో అంతస్తు మీంచి కిటికీలు అంత పెద్ద చెట్లనీ అమాంతం పొట్టిగా చేసేస్తాయి కదా అని మొదటిసారి చూసినప్పుడు విస్తుపోయింది. కిందకి వెళ్లినప్పుడు మళ్లీ ఆ నిద్రగన్నేరు మహావృక్షం అలానే ఉంది. గాలి అలల చిరు కదలికలతో స్థిరంగా. ఆమె మాత్రం పెనుకదలికలతో అస్థిరంగా.

ఇంకాస్త పైనుంచి చూస్తే ఎంత పెద్ద సమస్యా చిన్నదిగా ఈ చెట్లలాగ అనిపిస్తుంది. కానీ పైనుంచి చూడడం కష్టమే. కళ్లు తిరుగుతాయి. ఆమెకు అలా కళ్లు తిరిగేలా చూడాలని లేదు. వెనక్కి కూడా.

అతను లేవలేదు. దిండ్లను ఆనుకుని మరికాస్త కిందకి జారి ఆమెనే చూస్తూ పడుకున్నాడు.

అయిదు నిముషాలు. పది ఇంటూ పది గదిని మరింత ఇరుకు చేశాయి. గాలి కాస్త బరువెక్కి అలా వెళ్లి తేలికపడి వస్తానని కిటికీలోంచి తుర్రుమంది.

''అమ్మాయి కిటికీ పక్కన నిలుచుంది. కిటికీలోంచేం కనపడుతుందీ...'' వెనకనించి పాట సూటిగా వీపుని తాకేలోగా వీపు మీద బరువుగా పడివున్న జడ ఆపేసింది.

సడన్‌గా ఫ్రిజ్‌లో దాచిన నిన్నటి మల్లెలు అతని మదిలో మెదిలాయి.

జడని ముందుకు వేసుకుంటూ ఆమె వెనక్కి తిరిగి, ''ఏమో ఆ టీనేజ్‌లో ఏది ఎందుకు చేస్తామో చెప్పలేం కదా,'' అంది. ఇంకా, ''నీ పాటలు అప్పుడూ ఇప్పుడూ కూడా చాలా ఇష్టం. ఆ ఇష్టంకొద్దీ రాసి ఇచ్చి ఉంటాను. పాటలు ఇష్టమైతే మనిషి ఇష్టం కావాలని లేదు కదా!''

జారబడినవాడు లేచి కూచున్నాడు. చెంపకి చెయ్యి ఆన్చుకుని సూటిగా ఆమెవైపు చూశాడు. చాలాసేపు చూస్తూ ఉండిపోయాడు. చాలాసేపు అంటే రెండు నిమిషాలలోపే. కానీ ఆమెకు ఇబ్బందిగా అనిపించింది. కదిలి టీపాయ్ మీది పేపర్లు సరిచేసింది. పెన్నులు స్టాండ్‌లో సర్దింది. సర్దినవాటినే మళ్లీ సర్దింది.

చెయ్యి చాపి స్టాండ్‌లో సర్దిన పెన్నులు, పెన్సిళ్లు అన్నీ మళ్లీ బోర్లించాడు. అటూ ఇటూ చెల్లాచెదరు చేశాడు.

తిరిగి సర్దకుండా వదిలేసి, హేండ్ బేగ్ తీసుకుని భుజానికి తగిలించుకుని ''ఇక వెళ్లాలి,'' అంది.

''వెళ్లు ఎలా వెళ్తావో చూద్దాం,'' అన్నాడు లేవకుండానే.

''ఎలా వెళ్లేదేముంది ఎప్పటిలాగే వెళ్తా.''

దిండు కిందనుంచి నెమ్మదిగా ఆమె ఇంటి తాళాల గుత్తి తీసి నవ్వుతూ ఊగించాడు.

''ఇదేమి దొంగతనం,'' లాక్కోబోయింది.

అతను చెయ్యి వెనక్కి లాక్కోవడంతో మీద పడబోయి ఆపుకుంది.

''ఇవాళ ఏదో ఒకటి తేలితేనేగాని నిన్ను పంపేది లేదు,'' మళ్లీ దిళ్లమీద వాలి స్థిరంగా వెనక్కి జారబడ్డాడు.

‘‘అప్పుడు మనం ఇష్టపడ్డాం. ఇద్దరమూ పైకి చెప్పుకోలేకపోయాం. విడిపోయాం. రెండు జీవితాల్లోకి ప్రయాణించాం. అవీ చిత్రంగా మధ్యలో ఆగిపోయాయి ఇద్దరికీ. మళ్లీ ఇంకా విచిత్రంగా ఇద్దరం కలిశాం. అప్పటికీ ఇప్పటికీ నా ఇష్టం అలాగే ఉంది. కలిసి నడవాలని ఉంది. అప్పుడూ ఇప్పుడూ ఆ ఊహే లేదంటున్నావ్- నేను నమ్మను - ఎందుకలా అంటున్నావ్...’’

ఏదో కాస్త దుఃఖపు జీర, కొంచెం దిగులూ, మరికొంచెం కోపమూ ఉన్నాయి ఆ స్వరంలో.

గత కొద్ది ఏళ్లుగా ఆమె ప్రశాంతంగా ఉంది. సుఖంగా ఉంది. మధ్యలో పోయిన స్వేచ్ఛను సంపాదించుకుంది. తన కోసం తను బతకడం అంటే ఏమిటో తెలుసుకుంది.

కానీ ఇందులో కూడా హాయి ఉందా! తెలియడం లేదు. మరి ఇప్పుడిప్పుడు ఈ కొద్ది నెలలుగా ఇతను కలిశాక ఏదో హాయి- ఇది మోయలేని హాయా? మోయగలిగిన హాయా? సంక్షోభపు సందిగ్ధం.

వెనక్కి వచ్చి బేగ్ టీపాయ్ మీద పడేసింది. అలసటగా మళ్లీ నీల్ కమల్ కుర్చీలో వాలింది.

ఆమె ప్రతి కదలికనీ గమనిస్తున్న అతను నెమ్మదిగా లేచాడు. ఇందాకా గోడ అలమారలోంచి తీసి టేబుల్ మీద పుస్తకాల దొంతర మధ్య దాచిన నీలిరంగు ఫైల్ తీసి దాంట్లో పదిలంగా దాచిన ఇన్‌లాండ్ కవరు తీసి ఇచ్చాడు చదువుకోమని.

ఇచ్చి, ఫైల్ తిరిగి బల్లమీద పెట్టి వచ్చి మంచం మీద కూర్చున్నాడు.

ఆమె ఆశ్చర్యంగా ఆ కవరు చేతిలోకి తీసుకుని తన చేతిరాతలో ఉన్న అతని అడ్రస్ చూసి ఆశ్చర్యంగా అతనివేపు చూసింది.

చదువు అని కళ్లతో సైగ చేశాడు.

లేత నీలిరంగు ఇన్ లాండ్ కవరు రెండు మడతలుగా మడిచి పోస్ట్ చేసినది విప్పింది. పాత తేదీతో, ముప్పయి ఏళ్ల పైచిలుకు కిందటి తేదీ-

చిన్న చిన్న అక్షరాలు... అందమైన, పొందికైన అక్షరాలే కాదు... భావాలు, మాటలు.

సున్నితంగా, మర్యాదగా, కాస్త మొహమాటంగా, గొప్ప హాయిగా రాసిన భావాలు. వాటిని ఆ అక్షరాల్లో చదువుకుంటూండగా ఒక్కొక్క ఏడూ కరిగి వెనక్కి వెళ్లిపోయాయి. ఉత్తరం... ఆమె రాసిన ఉత్తరం... అతనికి ఆమె రాసిన ఉత్తరం... పోస్టల్ ముద్రలు పడి మూడు రోజులు ప్రయాణించి అతన్ని చేరిన ఉత్తరం-

ఆమె కళ్లు నిండిపోయాయి. అక్షరాలు కనపడక తుడుచుకుంది. మళ్లీ నిండి పోయి బుగ్గల మీదకి జారిపోతూండగా అప్పుడు చూసింది.

అతను ఎప్పుడు లేచాడో ఆమె కాళ్ల దగ్గర కూచున్నాడు. ఆమె ఒడిలో తల పెట్టుకుని పైకే ఏడుస్తూ, "ఇప్పుడు చెప్పు- నీకు అప్పుడు ప్రేమ లేదా. ఇందులో అదంతా ఉంది కదా," అంటున్నాడు.

అప్పుడు తనలో ప్రేమ ఉందో లేదో అదంతా ఇందులో ఉందో లేదో కూడా ఆమెకు తెలియదు. కానీ ఆమెకు అందులో తనను పోగొట్టుకున్న తాను కనిపించింది. ఆ తాజాదనం, ఆ అమాయకత్వం, ఆ సున్నితం అవన్నీ ఏవీ... ఏమైపోయాయి. ఎక్కడ ఎప్పుడు ఎలాంటి అనుభవాల మధ్య జారిపోయాయి-

యౌవన ప్రాదుర్భావ వేళ వికసించడానికి సమాయత్తమవుతున్న జాజిపువ్వు పరిమళం- అదంతా ఈ ఉత్తరంలో ఉంది. అది ఇప్పుడు తనలో లేదు. ఆ అమాయకత్వం, ఆ స్నిగ్ధత్వం ఇప్పుడెలా దొరుకుతాయి. ఆమెకు కన్నీళ్లు ఆగడం లేదు.

ఆమె కన్నీళ్లు అతనికి అర్థమవుతాయా?

తాజాదనం కోల్పోయిన నిన్నటి మల్లెదండ ఫ్రిజ్‌లో అలాగే ఉంది.

ఆమె నిన్నటి మల్లెదండ.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*1 మార్చి 2020*

❋




వాడ్రేవు వీరలక్ష్మీదేవి 19 జులై 1954న తూర్పుగోదావరి జిల్లాలో జన్మించారు. మొదటి కథ వెన్నెల ముగ్గు 1980లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో అచ్చయ్యింది. *ఉత్సవ సౌరభం, కొండఫలం, కిటికీ బయటి వెన్నెల* వీరి కథాసంపుటాలు. నూరుకు పైగా కథలు రాశారు. కవిత్వము, సాహిత్య వ్యాసాలు, నవలా పరిచయాలు, ప్రసిద్ధ నవలలపై పరిశోధనా గ్రంథం ప్రచురించారు. అధ్యాపక వృత్తిలో పదవీ విరమణ చేశారు.

***చిరునామా: ఫ్లాట్ నెం. 309, గ్రీన్‌స్పేస్ ఎన్‌క్లేవ్, శ్రీనివాసనగర్ రోడ్***
***తాడిగడప, పోరంకి, విజయవాడ - 521 134***
***ఫోన్: 98480 16442 vvlakshmidevi@gmail.com***